క్లుప్తంగా

వర్షాలకు కూలిన ఇళ్లు



సికింద్లాపూర్‌లో కూలిన ఇల్లు

చిన్నకోడూరు(సిద్దిపేట): మండలంలో రెండు రోజులుగా కురుస్తున్న వర్షాలకు రెండు పాత పెంకుటిళ్లు కూలిపోయాయి. మల్లారం గ్రామంలో బొర్ర బాల్‌రాజుకు చెందిన పాత ఇల్లు, సికింద్లాపూర్ గ్రామంలో జాలిగామ చంద్రమ్మకు చెందిన పాత పెంకుటిల్లు వర్షానికి పాక్షికంగా దెబ్బతిన్నాయి. విషయం తెలుసుకున్న రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ మల్లికార్జున్ శనివారం వాటిని పరిశీలించారు.

పారిశుద్ధ్య నిర్వహణకు చర్యలు: ఎంపీడీఓ



పనులు పరిశీలిస్తున్న ఎంపీడీఓ వేణుగోపాల్‌రెడ్డి

హుస్నాబాద్‌రూరల్: ప్రభుత్వ పాఠశాలలు, కాలేజీలను స్వచ్ఛతగా మార్చేందుక పంచాయతీ కార్యదర్శులు చర్యలు తీసుకోవాలని ఎంపీడీఓ వేణుగోపాల్‌రెడ్డి సూచించారు. గాంధీనగర్‌లోని ప్రభుత్వ పాలిటెక్నిక్ కాలేజీ పరిసరాల్లో చెట్లను తొలగించే పనులను శనివారం ఆయన పర్యవేక్షించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ వర్షాలతో మురుగునీరు నిల్వలేకుండా గుంతలను పూడ్చాలన్నారు. తాగునీరు కలుషితం కాకుండా పైపులైన్ గేట్ వాల్వ్‌లను శుభ్రం చేయాలని, వారంలో రెండు రోజులు డ్రై డే పాటించి దోమల నివారణ చేపట్టాలని ఆదేశించారు. స్వచ్ఛత గురించి ఇంటింటికి తిరిగి స్థానికులకు అవగాహన కల్పించాలని సూచించారు. ఆయన వెంట కార్యదర్శి సతీశ్ తదితరులు ఉన్నారు.

రైతుల సమస్యలు పట్టవా?



మాట్లాడుతున్న దయానంద్‌రెడ్డి

జగదేవ్‌పూర్(గజ్వేల్): కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలకు రైతుల సమస్యలు పట్టవా? అని సీపీఐ రాష్ట్ర కౌన్సిల్ మాజీ సభ్యుడు దయానంద్‌రెడ్డి మండిపడ్డారు. శనివారం ఆయన విలేకరులతో మాట్లాడారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు పంటలకు సరిపడే యూరియాను అందించకుండా రైతులను ఇబ్బందులు పెడుతున్నారని విమర్శించారు. ఎకరానికి ఒక బస్తా నిబంధన ఎత్తివేయాలని డిమాండ్ చేశారు. సకాలంలో యూరియా అందించకపోతే సీపీఐ పోరాటం చేస్తుందన్నారు. భిక్షపతి తదితరులు పాల్గొన్నారు.

అన్నదాన భవనానికి గ్రానైట్ అందజేత



గ్రానైట్ అందజేస్తున్న రాజనర్సు

ప్రశాంత్‌నగర్(సిద్దిపేట): మోహినీపుర వెంకటేశ్వర ఆలయంలో నూతనంగా నిర్మిస్తున్న అన్నదాన భవనానికి రూ.4 లక్షల విలువగల గ్రానైట్‌ను ఎమ్మెల్యే హరీశ్‌రావు అందించినట్లు ఆలయ ఈఓ మారుతి తెలిపారు. మున్సిపల్ మాజీ చైర్మన్ రాజనర్సు శనివారం ఈ గ్రానైట్‌ను అందించారు. గ్రానైట్ అందించిన హరీష్‌రావుకు, అన్నదాన భవన కమిటీ సభ్యులు సరాఫ్ అంజయ్య, సద్ది రాములు, చంద్రహాస్, యాద శ్రీనివాస్, ఆలయ చైర్మన్ నగేశ్ విష్ణు తదితరులు కృతజ్ఞతలు తెలిపారు.

ఉచిత వైద్య శిబిరం



మందులు అందజేస్తున్న వైద్యులు, సిబ్బంది

బెజ్జంకి(సిద్దిపేట): మండలంలోని బెజ్జంకి క్రాసింగ్‌లో జనవికాస సంస్థ ఆధ్వర్యంలో శనివారం ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. రోగులను పరీక్షించి మందులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో వైద్యులు సురేశ్, స్వప్న, గంగాధర్, బాలవికాస ప్రతినిధులు వట్టి సుజాత, అన్నామేరి, సుజాత తదితరులు పాల్గొన్నారు.

ప్లాస్టిక్‌తో పెను ముప్పు

దెబ్బతింటున్న పర్యావరణం | రోగాల బారిన ప్రజలు | వినియోగం తగ్గితేనే పరిష్కారం

అవసరాలకోసం వాడుతున్న ప్లాస్టిక్ పర్యావరణానికి ముప్పుగా పరిణమించింది. ప్లాస్టిక్ కవర్లు, వస్తువులతో వివిధ రకాల కాలుష్యాలకు కారణమైంది. వ్యవసాయరంగానికి, మన అనారోగ్య సమస్యలకు కూడా ప్రధాన కారణంగా మారిందని శాస్త్రవేత్తలు, వైద్యులు హెచ్చరిస్తున్నారు.



పరిసరాల్లో నిండిపోయిన ప్లాస్టిక్ వస్తువులు, కవర్లు

మిరుదొడ్డి(దుబ్బాక): ప్లాస్టిక్ వస్తువులు మన జీవితంలో రానున్న రోజుల్లో క్యాన్సర్ కారకంగా మారే ప్రమాదం పొంచి ఉందని పర్యావరణ వాస్త్రవేత్తలు చెప్తున్నారు. అంతటి ప్రమాదకరమైన ప్లాస్టిక్ కవర్లు, వస్తువులు ఎండకు ఎండవు, వానకు తడవవు, కాల్చినా వాటి గుణంలో మార్పు ఉండదు.

లోపిస్తున్న పారిశుద్ధ్యం

ఏ వస్తువులు కొనాలన్నా, ఏమి తినాలన్నా ప్లాస్టిక్ సంచులు, బాక్సులు, గ్లాసులు వినియోగించాల్సిన పరిస్థితి నెలకొంది. ప్లాస్టిక్ వస్తువులు, కవర్లు ముమ్మరంగా వినియోగించడం వల్ల పలు గ్రామాల్లో పారిశుద్ధ్యం లోపిస్తుంది. హోటళ్ళు, కిరాణా, మటన్, చికెన్ దుకాణాల్లో ప్రతిరోజు కొన్ని వందల సంఖ్యలో పాలిథిన్ కవర్లు, ప్లాస్టిక్ గ్లాసులు వినియోగంలోకి వచ్చాయి. దీంతో వాటిని ఎక్కడ పడితే అక్కడ పారవేయడం వల్ల పారిశుద్ధ్యం లోపిస్తోంది. పందులు, కుక్కలకు ఆవాసాలుగా మారుతున్నాయి. దీంతో దోమలు, ఈగలు విజృంభిస్తున్నాయి. దీని వల్ల ప్రజలు రోగాల బారిన పడుతున్నారు.

క్యాన్సర్‌కు కారకంగా..

చిన్నగా మొదలైన ప్లాస్టిక్ వాడకం నిత్యావసరంగా మారిపోయింది. తాగే నీరు నుంచి తినే తిండి వరకు ప్లాస్టిక్ కవర్లల్లోనే లభ్యమవుతుండటంతో ఆరోగ్య సమస్యలతోపాటు పర్యావరణం సైతం దెబ్బతినే అవకాశం ఏర్పడింది. పాలిథిన్ కవర్లల్లో తీసుకొచ్చే వేడిపదార్థాలల్లో రసాయన పదార్థాలు కలిసిపోయి, పిల్లల్లో ఎదుగుదల నిలిచి పోతుందని, తద్వారా క్యాన్సర్ బారిన పడే ప్రమాదం ఉందని డాక్టర్లు హెచ్చరిస్తున్నారు.



ఇళ్ల మధ్య గుట్టలుగా పేరుకున్న ప్లాస్టిక్ వస్తువులు

భూసారంపై ప్రభావం



మట్టిలో ప్లాస్టిక్ కరగక పోవడం వల్ల భూసారం దెబ్బతింటుంది. దీంతో దిగుబడులు తగ్గుతున్నాయి. ప్లాస్టిక్ సంచులు, వస్తువులు కాల్చివేసే సందర్భంలో వెలువడే వాయువుల వల్ల ఓజోన్ పొర దెబ్బతినే ప్రమాదం ఉంది. చెరువులు, కుంటల్లో ప్లాస్టిక్ కలిసిన నీటిని తాగితే పశువులు అనారోగ్యం పాలవుతున్నాయి. ప్లాస్టిక్ వినియోగం వల్ల వచ్చే అనర్థాలపై రైతులకు అవగాహన కల్పిస్తాం.

– అఖిల్, ఏఈఓ, మిరుదొడ్డి

అవగాహన అవసరం



ప్లాస్టిక్ వస్తువులను కాల్చడం వల్ల విషపూరితమైన రసాయనాలు విడుదలవుతాయి. దీంతో వాయు, నీటి కాలుష్యం ఏర్పడుతుంది. దీంతో ఊపిరితిత్తుల సంబంధ వ్యాధులు పెరుగుతున్నాయి. ప్లాస్టిక్ కవర్లల్లో వేడివేడి ఆహారపదార్థాల వినియోగం వల్ల రకరకాల క్యాన్సర్లకు దారితీస్తోంది. ప్లాస్టిక్ వినయోగంపై ప్రతిఒక్కరికి అవగాహన ఉంటేనే పర్యావరణాన్ని కాపాడగలుగుతాం. ప్లాస్టిక్ వస్తువుల వినియోగం తగ్గించాలి.

– డా.సమీనా సుల్తానా, పీహెచ్‌సీ, మిరుదొడ్డి

విధి నిర్వహణలో నిర్లక్ష్యంగా ఉండొద్దు

- కలెక్టర్ హైమావతి
- ఆయుష్ వైద్యురాలు, సిబ్బందిపై చర్యలకు ఆదేశాలు



ఆస్పత్రిలో రికార్డులు పరిశీలిస్తున్న కలెక్టర్ హైమావతి

కోహెడ(హుస్నాబాద్): విధి నిర్వహణలో నిర్లక్ష్యంగా ఉంటే చర్యలు తప్పవని కలెక్టర్ హైమావతి పీహెచ్‌సీ సిబ్బందిని హెచ్చరించారు. శనివారం ఆమె ఆస్పత్రిని తనిఖీచేసి రికార్డులు పరిశీలించారు. ల్యాబ్ టెక్నీషియన్ సతీశ్, సిబ్బంది విజయ విధులకు హాజరుకాకపోవడంతో ఆగ్రహం వ్యక్తం చేశారు. ఆయుష్ వైద్యురాలు కిరణ్‌కుమారి, లద్నూర్ పీహెచ్‌సీ నుంచి డిప్యూటేషన్‌పై వచ్చిన నర్సింగ్ స్టాఫ్ పూజ డిప్యూటేషన్ క్యాన్సెల్ చేసి ఇక్కడే విధులు నిర్వహించడంపై చర్యలు తీసుకోవాలని జిల్లా ఆరోగ్యశాఖ అధికారికి సూచించారు. వర్షాల నేపథ్యంలో అందరు విధులలో ఉండాలని ఆదేశాలు జారీ చేసినా నిర్లక్ష్యంగా ఉండటంపై డీహెచ్‌ఎంఓకు వివరణ ఇవ్వాలని ఆదేశించారు. సీజనల్ వ్యాధులకు సంబంధించిన మందులు అందుబాటులో ఉండేలా చూడాలని నర్సింగ్ అధికారి సృజనకు సూచించారు. పరిసరాలను పరిశుభ్రంగా ఉంచాలని చెప్పారు. యూరియా కొరత లేకుండా చూడాలని వ్యవసాయ మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ తిరుపతిరెడ్డి కలెక్టర్ హైమావతిని కోరారు. యూరియా కొరత లేకుండా చర్యలు తీసుకుంటున్నట్లు కలెక్టర్ చెప్పారు. కార్యక్రమంలో తహసీల్దార్ సమీర్ అహ్మద్‌ఖాన్, ఎంపీడీఓ కృష్ణయ్య తదితరులు పాల్గొన్నారు.

పారిశుద్ధ్య పనులు షురూ..

- తిమ్మాపూర్‌లో వైద్య శిబిరం
- 85 మందికి రక్త నమూనాల సేకరణ

సాక్షి ఎఫెక్ట్..

జగదేవ్‌పూర్(గజ్వేల్): తిమ్మాపూర్‌లో వైద్యశిబిరం, పారిశుద్ధ్య నిర్వహణ పనులు ప్రారంభించారు. వారం రోజులుగా ప్రజలు జ్వరాలతో బాధపడుతున్న విషయంపై సాక్షిలో శనివారం 'తిమ్మాపూర్‌లో విష జ్వరాలు' అనే కథనం ప్రచురితమైంది. ఈ కథనానికి జిల్లా వైద్యాధికారి ధన్‌రాజు స్పందించి శనివారం ఉదయం తిగుల్ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యుడు రాజశేఖర్‌కు ఫోన్‌చేసి తిమ్మాపూర్‌లో జ్వరాల పరిస్థితిపై ఆరా తీశారు. వెంటనే గ్రామంలో వైద్య శిబిరం ఏర్పాటు చేయాలని ఆదేశించారు. దీంతో రాజశేఖర్ ఆధ్వర్యంలో వైద్య బృందం గ్రామంలో వైద్య శిబిరం నిర్వహించారు. గ్రామంలో జ్వరాలతో బాధపడుతున్న వారికి పరీక్షలు నిర్వహించి మందులను అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 85 మంది నుంచి రక్త పరీక్షల కోసం నమూనాలు సేకరించామన్నారు. అలాగే కార్యదర్శి శైలేష్ పారిశుద్ధ్య పనులు ప్రారంభించారు. వర్షం నీరు నిల్వ ఉన్నచోట, జ్వరాలతో బాధపడుతున్న వారి ఇళ్ల పరిసరాల వద్ద దోమల నివారణకు మందులు పిచికారీ చేశారు. కార్యక్రమంలో సూపర్ వైజర్ ప్రేమలత, ఏఎన్ఎం రజిత, వీరేశం, ఆశా వర్కర్లు ఉమ, శారద, విజయదుర్గ తదితరులు పాల్గొన్నారు.



పరీక్షలు నిర్వహిస్తున్న వైద్య సిబ్బంది

రెవెన్యూ డివిజన్ హామీ నెరవేర్చండి

జేఏసీ చైర్మన్ నర్సయ్య పంతులు

మద్దూరు(హుస్నాబాద్): చేర్యాలను రెవెన్యూ డివిజన్ చేస్తామన్న హామీని కాంగ్రెస్ ప్రభుత్వం నెరవేర్చాలని చేర్యాల డివిజన్ సాధన జేఏసీ చైర్మన్ వకులాభరణం నర్సయ్య పంతులు డిమాండ్ చేశారు. మండల కేంద్రంలో శనివారం బైక్ ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో పాల్గొన్న ఆయన మాట్లాడుతూ అధికారంలోకి రాక ముందు డివిజన్ కోసం దీక్షలు చేసిన కాంగ్రెస్ నాయకులు ఇప్పుడు ముఖం చాటేస్తున్నారని ఎద్దేవా చేశారు. డివిజన్ ప్రకటించకపోతే రానున్న ఎన్నికలలో కాంగ్రెస్‌కు ప్రజలు గట్టి గుణపాఠం చెప్తారని హెచ్చరించారు. సీపీఎం జిల్లా కార్యదర్శి ఆముదాల మల్లారెడ్డి, బీజేపీ జిల్లా ఉపాధ్యక్షుడు బూర్గు సురేశ్, మాజీ ఎంపీపీ బద్దిపడిగ కృష్ణారెడ్డి, బీఆర్ఎస్ మద్దూరు, దూళ్మిట్ట అధ్యక్షుడు సంతోష్‌కుమార్, యాదగిరి, జేఏసీ నాయకులు మల్లేశం, పరశురాములు, తిరుపతిరెడ్డి, శ్రధర్‌రెడ్డి, వెంకటరమణారెడ్డి, రాజమల్లయ్య తదితరులు పాల్గొన్నారు.



బైక్ ర్యాలీలో పాల్గొన్న జేఏసీ నాయకులు



హుస్నాబాద్: కోలాట నృత్యాలతో మహిళలు



బెజ్జంకి(సిద్దిపేట): గాగిల్లాపూర్ ధ్యాననిష్టాశ్రమంలో..

తిగుల్‌లో బోనాల సందడి



బోనాలతో తరలి వస్తున్న మహిళలు

జగదేవ్‌పూర్(గజ్వేల్): మండలంలోని తిగుల్ గ్రామంలో శనివారం రెడ్డిసంఘం ఆధ్వర్యంలో మహంకాళమ్మకు బోనాలు సమర్పించారు. డప్పు చప్పుళ్లు, పోతరాజుల ఆటపాటల మధ్య బోనాలతో ఆలయానికి చేరుకుని అమ్మవారికి నైవేద్యం సమర్పించారు. పంటలు బాగా పండాలని, ప్రజలు సుఖసంతోషాలతో ఉండాలని మొక్కుకున్నారు. అలాగే ఆదివారం పోచమ్మకు బోనాలు సమర్పిస్తామని తెలిపారు. కార్యక్రమంలో సంఘం అధ్యక్షుడు చంద్రశేఖర్‌రెడ్డి, సభ్యులు అంజిరెడ్డి, శ్రీనివాస్‌రెడ్డి, సుధాకర్‌రెడ్డి, మహేందర్‌రెడ్డి, నర్సింహారెడ్డి, రామకృష్ణరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

'కృష్ణ చరితం' ఆవిష్కరణ



పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న నాయకులు

ప్రశాంత్‌నగర్(సిద్దిపేట): ప్రతి ఒక్కరు ప్రముఖ కవి ఉండ్రాళ్ల రాజేశం రచించిన కృష్ణ చరితం శతకాన్ని చదవాలని అఖిల భారత యాదవ మహాసభ నాయకులు శ్రీహరి యాదవ్, అయిలయ్య యాదవ్ సూచించారు. జిల్లా కేంద్రంలోని యాదవ ఫంక్షన్ హాల్‌లో ఆ గ్రంథాన్ని శనివారం ఆవిష్కరించారు. ముఖ్య అతిథులుగా హాజరై వారు మాట్లాడారు. పండిత పామరులకు అర్థమయ్యేలా కృష్ణ చరితం రచన ఉందని, రాజేశం ఆటవెలది పద్యాలు అమృతంలా ఉంటాయని ప్రశంసించారు. కార్యక్రమంలో యాదవ సంఘం నాయకులు పాల్గొన్నారు.

గోకుల కృష్ణా.. గోపాల కృష్ణా..

జిల్లాలో కృష్ణాష్టమి వేడుకలు ఘనంగా జరిగాయి. ఈ సందర్భంగా ఆలయాల్లో శనివారం భక్తులు ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించారు. ముద్దులొలికే చిన్నారులు కృష్ణుడు, గోపికల వేషధారణలతో సందడి చేశారు.



సిద్దిపేటలో రాధాకృష్ణులుగా..



జగదేవ్‌పూర్(గజ్వేల్): తిగుల్ ఆలయంలో..



గజ్వేల్‌రూరల్: కర్బూజకాయపై శ్రీకృష్ణుడి రూపాన్ని చిత్రించిన రామకోటి రామరాజు



చిన్నకోడూరులో కృష్ణుడు, గోపిక వేషధారణతో చిన్నారులు



సిద్దిపేటరూరల్: భాచ్చాయిపల్లిలో..



మిరుదొడ్డి(దుబ్బాక): రాధాకృష్ణుల వేషధారణలో అంగన్‌వాడీ చిన్నారులు

సంక్షిప్త వార్తలు

◆ వాజ్‌పేయి సేవలు మరువలేనివి

గజ్వేల్‌రూరల్: మాజీ ప్రధాని, భారతరత్న అటల్ బిహారీ వాజ్‌పేయి దేశానికి అందించిన సేవలు మరువలేనివని బీజేపీ నాయకులు కొనియాడారు. వాజ్‌పేయి వర్ధంతి సందర్భంగా శనివారం గజ్వేల్‌లో ఆయన చిత్రపటానికి పూలమాలవేసి నాయకులు నివాళులర్పించారు. అనంతరం వారు మాట్లాడుతూ బీజేపీకి వ్యవస్థాపక అధ్యక్షుడిగా పనిచేసిన వాజ్‌పేయి అలుపెరగని రాజకీయ నాయకుడిగా ఉత్తమ పార్లమెంటేరియన్ అవార్డును అందుకున్నారని గుర్తు చేశారు. కార్యక్రమంలో నాయకులు ఉప్పల మధుసూదన్, బండారు మహేశ్, శ్రీనివాస్ రెడ్డి, శ్రీనివాస్, ఏగొండ, అరవింద్, నర్సింహ, సుమతి, మమత తదితరులు పాల్గొన్నారు.

◆ హైమాస్ట్ లైట్లు ప్రారంభించిన ఎమ్మెల్సీ

వర్గల్(గజ్వేల్): మండలంలోని శేరిపల్లి స్కూల్‌వద్ద నూతనంగా ఏర్పాటుచేసిన హైమాస్ట్‌లైట్లను ఎమ్మెల్సీ డాక్టర్ యాదవరెడ్డి శనివారం ప్రారంభించారు. అదేవిధంగా గ్రామంలోని పెద్దమ్మ ఆలయం వైపు సీసీరోడ్డు నిర్మాణానికి రూ.3 లక్షల నిధులు కేటాయిస్తున్నట్లు ఆయన తెలిపారు. కార్యక్రమంలో మాజీ జెడ్పీటీసీ బాలుయాదవ్, మాజీ సర్పంచ్ నారాయణ, మాజీ ఎంపీటీసీ కొండల్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

◆ ఘనంగా కృష్ణస్వామి జయంతి

చిన్నకోడూరు(సిద్దిపేట): ముదిరాజ్ హక్కుల పోరాట యోధుడు కొరివి కృష్ణస్వామి జయంతిని శనివారం చిన్నకోడూరు పెద్దమ్మ దేవాలయంలో ఘనంగా నిర్వహించారు. ఆయన చిత్ర పటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ముదిరాజ్ సంఘం వ్యవస్థాపకుడిగా, హైదరాబాద్ నగర కార్పొరేషన్ చైర్మన్‌గా, కవిగా, పాత్రికేయుడిగా కృష్ణస్వామి ఎనలేని సేవలు చేశారని కొనియాడారు. కార్యక్రమంలో నాయకులు శ్రీనివాస్, వెంకటేశం, పాపయ్య, శ్రీనివాస్, పెద్దులు పాల్గొన్నారు.

◆ అక్రమ మద్యం పట్టివేత

హుస్నాబాద్: స్వాతంత్ర్య దినోత్సవం రోజున హన్మకొండరోడ్‌లో అక్రమంగా మద్యం అమ్ముతున్న దుకాణంపై ఎక్సైజ్ అధికారులు దాడులు నిర్వహించారు. ఆ నిర్వాహకుడిని పట్టుకొని మద్యాన్ని స్వాధీనం చేసుకున్నారు. అతడిపై కేసు నమోదు చేసినట్లు ఎక్సైజ్ సీఐ పవన్ తెలిపారు.

◆ బకాయిలు విడుదల చేయండి

సిద్దిపేటకమాన్: ఉపాధ్యాయ ఉద్యోగులకు రావాల్సిన బకాయిలను ప్రభుత్వం వెంటనే విడుదల చేయాలని డీటీఎఫ్ జిల్లా నాయకులు డిమాండ్ చేశారు. సిద్దిపేట అంబేడ్కర్ సర్కిల్‌లో శనివారం వారు మాట్లాడుతూ ఉద్యోగ, ఉపాధ్యాయుల సమస్యలు పరిష్కరించాలన్నారు. కుమార్, సత్తయ్య, ఉపేందర్ తదితరులు పాల్గొన్నారు.

◆ అరుదైన శస్త్ర చికిత్స

సిద్దిపేటజోన్: జిల్లా కేంద్రంలోని ఒక ప్రైవేట్ ఆస్పత్రిలో శనివారం అరుదైన శస్త్రచికిత్స నిర్వహించారు. 40 యేళ్ల వయస్సు ఉన్న బాధితుడికి పెద్దపేగులో మూత్రాశయానికి అంటుకొని ఉన్న గడ్డను గుర్తించారు. హైదరాబాద్‌కు చెందిన ప్రముఖ సర్జికల్ గ్యాస్ట్రో వైద్యుడు ప్రశాంత్ ఆధ్వర్యంలో ఐదు గంటల పాటు సర్జరీచేసి దానిని తొలగించారు.

◆ 24న టీపీటీఎఫ్ విద్యాసదస్సు

గజ్వేల్: టీపీటీఎఫ్ సీనియర్ నాయకుడు పి.ఎల్లయ్య పదవీవిరమణ సందర్భంగా 24న గజ్వేల్‌లో విద్యా సదస్సు నిర్వహిస్తున్నట్లు ఆ ఫెడరేషన్ రాష్ట్ర మాజీ అధ్యక్షుడు ఎ.రాంచంద్రం, రాష్ట్ర కౌన్సిలర్ రాజులు, జిల్లా ప్రధాన కార్యదర్శి నరేందర్ తెలిపారు. టీపీటీఎఫ్ స్థానిక జోన్ కార్యాలయంలో శనివారం సదస్సుకు సంబంధించిన కరపత్రాలను ఆవిష్కరించారు. ఫెడరేషన్ నాయకులు పాపిరెడ్డి, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

◆ ఆలయాల్లో ప్రత్యేక పూజలు

దుబ్బాక: శ్రీకృష్ణాష్టమి సందర్భంగా శనివారం కూడవెల్లి రామలింగేశ్వర ఆలయం, చౌదర్‌పల్లి దుబ్బరాజేశ్వర ఆలయాల్లో ప్రత్యేక పూజలు జరిగాయి. ఈ సందర్భంగా స్వామివార్లకు పుష్పార్చన, అభిషేకాలు నిర్వహించారు. భక్తులు స్వామివార్లను దర్శించుకొని మొక్కులు తీర్చుకున్నారు.

◆ యూరియా కొరత లేదు

అక్కన్నపేట(హుస్నాబాద్): మండల కేంద్రంలో యూరియా కొరత ఉందనడం అవాస్తవమని కాంగ్రెస్ పార్టీ మండలాధ్యక్షుడు జంగపల్లి అయిలయ్య, మాజీ సర్పంచ్ ముత్యాల సంజీవ్‌రెడ్డి అన్నారు. మండల కేంద్రంలో శనివారం వారు విలేకరులతో మాట్లాడారు. మండల వ్యాప్తంగా 32.4 టన్నుల యూరియా నిల్వ ఉందన్నారు. రవి, రాజయ్య, సారయ్య, రమేశ్, రాజయ్య, శ్రీనివాస్, బాలరాజు, గణేశ్, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

◆ నూతన కార్యవర్గం నియామకం

సిద్దిపేటకమాన్: సిద్దిపేట బోయిగల్లి శాలివాహన సంఘం నూతన కార్యవర్గాన్ని శనివారం ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా అజయ్, ప్రధాన కార్యదర్శిగా పరశురాములు, కోశాధికారిగా ప్రసన్నకుమార్, ఉపాధ్యక్షుడిగా ఎల్లం, లోకేశ్, కార్యవర్గ సభ్యులుగా అవినాష్, శంకర్ తదితరులు పాల్గొన్నారు.